# వెంకటేష్ 'విక్టరీ'కి 20 యేళ్ళు




ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, కారంచేడులో ఒక వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన దగ్గుపాటి రామానాయుడు గారు కాలాంతరంలో ప్రపంచ రికార్డు సాధించిన నిర్మాతగా, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన 'చలనచిత్ర చక్రవర్తి'గా ఘనకీర్తిని సాధించారు.. ఆయన పెద్ద కుమారుడు సురేష్ నిర్మాతగా తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తుండగా, చిన్న కుమారుడు వెంకటేష్ మాత్రం తన తండ్రి అభిరుచి మేరకు హీరోగామారారు.

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలోనిర్మించబడిన "కలియుగ పాండవులు" చిత్రం ద్వారా వెంకటేష్ హీరోగా తెలుగుతెరకు పరిచయం అయ్యారు. ఆ చిత్రంలో ఆయన సరసన ఖుష్బూ హీరోయిన్‌గా నటించింది. ఆ చిత్రం సూపర్ డూపర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత ఆయన విలక్షణ పాత్రలతో, విభిన్న చిత్రాల్లో తన నటనాపటిమను నిరుపించుకున్నారు. తన ప్రతి చిత్రంతో "విక్టరీ" ని సొంతం చేసుకున్నందుకు గాను ఆయన అభిమానులు ఆయన్ని "విక్టరీ" వెంకటేష్ అని అభిమానంతో పిల్చుకుంటారు.



బ్రహ్మపుత్రుడు, బొబ్బిలి రాజా, స్వర్ణ కమలం, క్షణం... క్షణం, చిన రాయుడు, చంటి, కొండపల్లి రాజా, కూలీనెం:1, సుందరాకాండ, పవిత్ర బంధం, ధర్మచక్రం, ప్రేమించుకుందాం..రా..!, గణేష్, నువ్వునాకు నచ్చావ్, ప్రేమ, రాజా, శీను, మల్లీశ్వరి, దేవీపుత్రుడు, ప్రేమంటే ఇదేరా, "జయం మనదేరా, సూర్యవంశం" (ఈ రెండు చిత్రాల్లో ద్విపాత్రాభినయం చేశారు), వాసు, లక్ష్మీ వంటి చిత్రాలలో ఆయన నటన ప్రేక్షకాభిమానాన్ని చూరగొంది. వెంకటేష్‌కి అభిమానులుగా యువకులతో పాటు మహిళా ప్రేక్షకులు కూడా అధికసంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు.



వివాద రహితుడిగా, క్రమశిక్షణ, అంకితభావం కలిగిన చక్కని నటుడిగా, అందరికీ స్నేహపాత్రుడిగా, వేదాంతిగా, అన్నిటినీ మించి మంచి మనసున్న మనిషిగా ఆయనకు చిత్ర పరిశ్రమలో విలక్షణమైన గుర్తింపు ఉంది. తండ్రికి తగ్గ తనయుడిగా, విక్టరీని తన ఇంటిపేరుగా మార్చుకున్న హీరో వెంకటేష్ తన సినీ జీవితంలో నటుడిగా ఇరవై వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనకు తెలుగువన్ డాట్ కమ్ శుభాకాంక్షలు తెలుపుతోంది.